# ఉద్యోగుల రక్షణే ముఖ్యం



సోమ్ మిట్టల్

హైదరాబాద్, ఫిబ్రవవరి 22 (సూర్య బిజినెస్ బ్యూరో): ఉద్యోగుల రక్షణ విషయంలో సంస్థలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని నాస్కామ్ అధ్యక్షుడు సోమ్ మిట్టల్ అన్నారు. సంస్థలు కూడా వారి రక్షణ విషయంలో అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. ఆయనపై కర్నాటక ప్రభుత్వం నమోదు చేసిన కేసుపై విచారణ కొనసాగించాలని సుప్రీం కోర్టు గురువారం ఇచ్చిన తీర్పుపై ఆయన వ్యాఖ్యానించడానికి నిరాకరించారు. అది కోర్టు ధిక్కారమవుతుందని అన్నారు. హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ (హైసియా) 16వ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొనే నిమిత్తం ఆయన హైదరాబాద్ వచ్చారు.

మహిళలను రాత్రి షిఫ్టులలో పనిచేయించిన నేరానికి హ్యూలెట్ -పేకార్డ్ (హెచ్ పి)గ్లోబల్ సాఫ్ట్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ అయిన సోమ్ మిట్టల్ కర్నాటక పోలీసుల విచారణను ఎదుర్కోనున్నారు. 2005 డిసెంబర్‌లో ప్రతిభ శ్రీకాంత్ మూర్తి అనే 24 ఏళ్ల మహిళా హెచ్ పి ఉద్యోగినిని ఆమెను కార్యాలయానికి తీసుకు వచ్చే టాక్సీ డ్రైవర్ దారుణంగా రేప్ చేసి హత్య చేసిన ఘటనలో సంస్థ అప్పటి యజమాని మిట్టల్ కూడా భద్యత వహించాలని కోర్టు తీర్పునిచ్చింది. మహిళలను, యువతను నైట్‌షిఫ్టులలో పనిచేయించరాదని కర్నాటక రాష్ట్రంలో చట్టాలన్నాయి. తనపై కర్నాటక పోలీసులు నమోదుచేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయవలసిందిగా కోరతూ ఆయన పెట్టుకున్న విన్నపాన్ని సుప్రీమ్ కోర్టు తోసిపుచ్చడంతో ఆయనపై విచారణ అనివార్యం అయ్యింది. దీనితో యజమానులు ఉద్యోగుల రక్షణకి కూడా భాధ్యత వహించాలని కోర్టు చెప్పినట్టయ్యింది.

భారతదేశంలో ఐటి అభివృద్ధికి పట్టుకొమ్మ అయిన ఎస్టిపిఐలకి 2009 తరువాత కూడా ప్రస్తుతం ఇస్తున్న రాయితీలు కొసాగించాలని మిట్టల్ అభిప్రయ పడ్డారు. ఈమేరకు ఆర్థిక మంత్రికి నాస్కామ్ తరపున వినతి పత్రాన్ని కూడా ఇచ్చినట్టు తెలిపారు. వీటిని కనీసం మరో పది సంవత్సరాల పాటూ కొనసాగించాలని అయన అన్నారు. అదేవిధంగా విద్యార్థులలో ఉద్యోగావకాశాలు పెపొందించే నిమిత్తం ప్రస్తుత బడ్జెట్‌లో విద్యకు ఎక్కువ కేటాయింపులు జరగాలని అన్నారు.